# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 32 10-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ


94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు..

- 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై సీఎం స్పష్టం
- డిలిమిటేషన్‌లో దక్షిణాదికి అన్యాయం వద్దు.. ప్రస్తుత నిష్పత్తే కొనసాగాలి
- జిల్లాల కుదింపు లేదు.. కులగణన సామాజిక న్యాయానికి పునాది
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఆగదు.. కేసీఆర్ కుటుంబంపై రేవంత్ ఘాటు విమర్శలు




తెలంగాణ రాజకీయ భవిష్యత్తు , జాతీయ స్థాయి ఎన్నికల విధానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనిచ్చారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో, 2029లో దేశవ్యాప్తంగా జరిగే సాధారణ ఎన్నికలతో పాటే తెలంగాణ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో నియోజకవర్గాల విభజన, రాష్ట్రాల వాటాపై ఆయన తన గళాన్ని వినిపించారు. రాబోయే డిలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియపై రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. జనాభా ప్రాతిపదికన ఎంపీ స్థానాలను పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య ఉన్న ఎంపీ స్థానాల నిష్పత్తి ప్రకారమే భవిష్యత్తులోనూ విభజన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను శిక్షించేలా కాకుండా, ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని కాపాడుతూనే నియోజకవర్గాల పెంపు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణ ఇస్తున్న రూపాయికి వస్తోంది 42 పైసలే..

- తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే, అక్కడి నుంచి 42 పైసలు మాత్రమే వస్తున్నాయి
- దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోంది
- యూపీ రూపాయి చెల్లిస్తే, కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయాలు తిరిగి ఇస్తుంది
- బీహార్ రూపాయి చెల్లిస్తే, అక్కడ ఆరు రూపాయాలు తిరిగి ఇస్తున్నారు -సీఎం రేవంత్ రెడ్డి

2లో



## పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు

- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం
- అన్నం వృథా చేయకపోవడం దేశ నిర్మాణంలో భాగమేనని సూచన
- విజయానికి క్రమశిక్షణే పునాది అని విద్యార్థులకు ప్రధాని స్పష్టీకరణ

10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026'

- మిగతా 2వ పేజీలో

## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు..

- అంబటి రాంబాబుకి బెయిల్ మంజూరు చేసిన స్పెషల్ మొబైల్ కోర్టు..
- చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అంబటికి బెయిల్..
- ఇదే కేసులో రాజమండ్రి జైలులో రిమాండ్‌లో ఉన్న అంబటి..
- పోలీసుల కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు..
- మరో కేసులో అంబటికి ఈ నెల 22 వరకు రిమాండ్..

2లో

## అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం.. 24 వేల కోళ్ల మృతి

- సదుం మండలంలోని మూడు గ్రామాల్లో 24 వేల కోళ్ల మృతి
- భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో వైరస్‌గా నిర్ధారించిన అధికారులు
- ప్రభావిత గ్రామాల్లో అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న నిపుణులు

2లో

## జనసేన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో ట్విస్ట్

- అమరావతి: జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎపిసోడ్..
- ఇప్పటికే ఈ ఎపిసోడ్ లో రోజుకో వీడియో విడుదల చేస్తున్న బాధితురాలు..
- నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న విచారణ కమిటీ..
- అరవ శ్రీధర్ వ్యవహారంపై జేఎల్పీ భేటీలో డిప్యూటీ సీఎం పవన్ సీరియస్..
- నివేదిక ఇవ్వకపోవడంపై విచారణ కమిటీపై అనుమానాలు..



## కాంగ్రెస్, బీజేపీ మధ్యే మున్సిపోరు


### గోదావరిఖని ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి

### రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగైంది..

### హామీలను విస్మరిస్తూ కాంగ్రెస్ వంచన

శ్రీరాంపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగైందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఇప్పటికే కోత విధించిన ఆదాయపన్ను తిరిగి చెల్లిస్తామని, భవిష్యత్‌లో పూర్తిగా మాఫీ చేస్తామని మంత్రి కిషన్‌రెడ్డి అభయం ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బీజేపీ కేంద్ర నాయకుడు ఎస్.కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన

- మిగతా 2వ పేజీలో





2లో

## సర్‌కు ఆటంకం కలిగిస్తే ఊరుకోం

- బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక
- జాబితా పూర్తికి మరో వారం గడువు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ విషయంలో ఎన్నికల కమిషన్(ఈసీ), రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. సర్ ప్రక్రియకు అవరోధాలు కలిగించవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అదే సమయంలో, ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈసీ గడువును మరో వారంపాటు పొడిగించింది. ఈ నెల 4వ తేదీన జరిగిన విచారణకు సీఎం మమతా బెనర్జీ స్వయంగా హాజరై వాదనలు

## కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

- అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా ఎవరూ మాట్లాడలేదు
- రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదన్న కేటీఆర్
- రెండేళ్ల తర్వాత పాతాళంలో దాక్కున్నా ఊరుకునేదని వ్యాఖ్య



2లో

## అమెరికాతో ఉద్రిక్తతలు.. 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్

- అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఈ అనూహ్య పరిణామం
- గల్ఫ్ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలను మోహరిస్తున్న అమెరికా
- అమెరికా దాడి చేస్తే యుద్ధం తప్పదని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

2లో

# అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం.. 24 వేల కోళ్ల మృతి

ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది.దవివరాల్లోకి వెళితే.. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశు సంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

## కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్యమంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు. భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## అమెరికాతో ఉద్రిక్తతలు.. 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఇరాన్‌లో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ 37 ఏళ్లుగా పాటిస్తున్న ఒక కీలక సంప్రదాయాన్ని తొలిసారిగా పక్కనపెట్టారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 8న జరిగే వైమానిక దళ కమాండర్ల సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. 1989లో నాయకత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఖమేనీ ప్రతి సంవత్సరం ఈ సమావేశానికి హాజరవుతూ వస్తున్నారు. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో కూడా ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు. 1979 ఫిబ్రవరి 8న ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు పహ్లావి రాజవంశాన్ని కూలదోసి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతొల్లా రుహొల్లా ఖమేనీకి మద్దతు ప్రకటించారు. ఆ చారిత్రక ఘటనకు గుర్తుగా ఏటా ఈ తేదీన వైమానిక దళ ఉన్నతాధికారులు సుప్రీం లీడర్‌తో భేటీ అవుతారు. ఈ ఏడాది ఖొమేనీకి బదులుగా ఆర్మీ చీఫ్ అబ్దొల్‌రహీం మౌసవి కమాండర్లతో సమావేశమయ్యారు.

## జనసేన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో ట్విస్ట్

జనసేన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు కొనసాగుతున్నాయి. విచారణ కమిటీ నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేస్తుంది. అరవ శ్రీధర్ అంశంపై జేఎల్పీ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. మొన్న జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలోనూ అరవ శ్రీధర్ వ్యవహారంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. అయినా ఇప్పటి వరకు విచారణ కమిటీ నివేదిక సిద్ధం కాకపోవడం హాట్ టాఫిక్ గా మారింది. గత నెల 27వ తేదీన వీడియోలు బయటికి వచ్చినప్పటికీ ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు లేవు? అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. విచారణ కమిటీ ఏర్పాటు చేసి రెండు వారాలు గడిచినా నివేదిక రాకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, అరవ శ్రీధర్‌ను కాపాడే ప్రయత్నమేనా? జరుగుతుందని విపక్షాల ఆరోపణలు చేస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై నివేదిక మరింత ఆలస్యం అయింది. ఈ వారంలో మరోసారి రైల్వే కోడూరులో విచారణ కమిటీ పర్యటించనుంది.

## సర్‌కు ఆటంకం కలిగిస్తే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)

వినిపించడం తెల్సిందే. 'వాట్సాప్ ద్వారా కాకుండా ఈసీ అధికారికంగా ఆదేశాలు జారీ చేయాలి. వాటిని ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. మైక్రో అబ్జర్వర్లను తొలగించాలి'అని కోరారు. వీటిపై సుప్రీంకోర్టు కేంద్రం, ఈసీలకు నోటీసులు జారీ చేసింది. సోమవారం వీటిపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. 'సర్ విషయంలో ఎదురయ్యే ఆటంకాలను తొలగిస్తాం. ఈ విషయంలో ఎటువంటి అడ్డంకులను కలిగించం. ఇందులో మావైఖరి సుస్పష్టం'అని సీజేఐ తెలిపారు. సర్ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం కొనసాగాల్సిందేనని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అవగాహన లేని అధికారులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారు(ఈఆర్వో)లను నియమించిందంటూ ఈసీ తరఫున సీనియర్ లాయర్ డీఎస్ నాయుడు అభ్యంతరం తెలపగా మైక్రో అబ్జర్వర్లు ఏకపక్షంగా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారంటూ బెంగాల్ ప్రభుత్వం తరఫున న్యాయవాది శ్యామ్ దివాన్ ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఇస్తున్న రూపాయికి వస్తోంది 42 పైసలే.

తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ (యూపీ) రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా?" అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ (జుణ) వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను తగ్గించే ఆలోచన గానీ, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన గానీ ప్రస్తుతానికి లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడమే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే సామాజిక న్యాయం దిశగా ఒక కీలక అడుగు అని, ఇది భవిష్యత్తులో సమగ్ర అభివృద్ధికి పునాది వేస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఆపే ప్రసక్తే లేదని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. "ఎవరు సహకరించినా, సహకరించకపోయినా మేము మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం" అని ధీమా వ్యక్తం చేశారు. అజహరుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి ఆమోదం పొందకపోవడంపై స్పందిస్తూ, ఆ ప్రశ్నకు గవర్నర్ దగ్గరే సమాధానం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే, అన్ని కులాలు తనను సొంత మనిషిగా భావిస్తున్నాయని, కేవలం శర్మలు మాత్రమే ఇంకా తనను ఓన్ చేసుకోలేదని చమత్కరించారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాలపై రేవంత్ రెడ్డి సూటిగా స్పందించారు. "అధికారం ఉన్నంత కాలం కేసీఆర్ కుటుంబం కలిసి ఉంది.. అధికారం కోల్పోగానే విడిపోయారు" అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. "మన ఇంట్లో ఉన్న ఆడపిల్లను మనం గౌరవంగా చూసుకుంటే, బయట వారు మన గురించి మాట్లాడే అవకాశం ఉండదు. ఇంట్లో సమస్యను వాళ్లే పరిష్కరించుకోలేనప్పుడు బయట వ్యక్తులు ఎందుకు వస్తారు?" అని ప్రశ్నించారు. తనకు వయసు తక్కువైనా, పరిణామాలు తనకు ఎంతో అనుభవాన్ని ఇచ్చాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ మధ్యే మున్సిపోరు: కిషన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. సింగరేణిలో భయాకమైన పరిస్థితులు నెలకొన్నాయని, సింగరేణి అధికారులతో సమీక్షించాక అనేక విషయాలు వెలుగు చూశాయని తెలిపారు. రూ.51వేల కోట్లకన్నా అధికంగానే ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉందని, బొగ్గు, విద్యుత్ తీసుకుంటూ ఒక్కపైసా చెల్లించడం లేదన్నారు. సంస్థ పనితీరు, సంక్షోభం గురించి కార్మిక సంఘాలు కూడా నిర్మొహమాటంగా అనేక విషయాలు వెల్లడించారన్నారు. ఈ విషయాలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు. ముస్లిం ఓట్లకోసమే సీఎం రేవంత్‌రెడ్డి తన పేరును రేవంత్‌ఖాన్‌గా పెట్టుకున్నారని మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మజ్లిస్ కనుసన్నల్లోనే కాంగ్రెస్ పనిచేస్తోందని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను దోచుకున్నాయని, రెండు పార్టీలకు సింగరేణి ఏటీఎంగా మారిందన్నారు. కారు గుర్తుకు భవిష్యత్ లేదని కేసీఆర్ కూతురు కవిత వ్యాఖ్యానిస్తున్నారని, కారులో ఒకటైరు కవిత, మరోటైరు కేటీఆర్ తీసుకెళ్లారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారని, బీఆర్ఎస్ రాష్ట్రంలో కనుమరుగైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజలను వంచనకు గురిచేస్తోందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తేనే రామగుండం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు ఎస్.కుమార్, దుగ్యాల ప్రదీప్, బల్మూరి వనిత, సంధ్యారాణి, సంజీవరెడ్డి, గోమాస శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కాసిపేట శివాజీ, కోమళ్ల మహేశ్, రాజమౌళి గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అంటేనే కమీషన్, కరప్షన్, మోసం, దగా అని, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సింగరేణిని దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిని రక్షించుకోవాలంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టాలని, ఒకవేళ వారు గెలిస్తే మనకు వాత పెడుతారన్నారు.

## 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

# అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు..

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేసింది కోర్టు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బెయిల్ మంజూరు అయ్యింది. అంబటికి ఈ బెయిల్‌ను గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు మంజూరు చేసింది.. అయితే, ఇదే కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు అంబటి రాంబాబు.. మరో కేసులో ఈ నెల 22 వరకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో.. ఈ కేసులో బెయిల్ మంజూరు అయినా.. ఆయన జైలులోనే ఉండాల్సిన పరిస్థితి.. మరోవైపు.. పోలీసులు అంబటిని మరోసారి కస్టడీకి తీసుకోవాలని పిటిషన్ చేసినా, మొబైల్ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో అంబటి బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం వచ్చినా.. మరో కేసులో రిమాండ్ ఉండడంతో.. ఆయన జైలులోనే ఉండాల్సిన పరిస్థితి.. ఇక, గతేడాది నవంబర్ 12న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఆరోపణలపై అంబటి రాంబాబుకి రిమాండ్ విధించారు. ఈ కేసు కూడా ప్రస్తుతం ఈ నెల 22 వరకు రిమాండ్ కొనసాగుతోంది. అంటే.. మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళనకు సంబంధించిన కేసులో అంబటి రాంబాబుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో వాదనలు విన్న అనంతరం స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు.. అంబటి రాంబాబు పై 35 క్వాష్ పిటిషన్ల విచారణను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. కీలక ప్రశ్నలు లేవనెత్తింది.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 35 కేసులు నమోదయ్యాయి. అయితే, అంబటి రాంబాబు వీటిని క్వాష్ చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులపై విచారణ జరుగుతుండగా, హైకోర్టు పోలీసులకు కీలక సూచనలు చేసింది. విచారణలో దీచీూా 35(3) ప్రొసీజర్‌ని పాటించాలని, తుది నిర్ణయం వెలువడే వరకు తొందరపాటు చర్యలు తీసుకోకూడదని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఒకే విషయంపై 35 ఖీ×=లు నమోదు చేయడం ఏంటి? అని ప్రశ్నించింది హైకోర్టు.. అంబటి రాంబాబు తరఫున హాజరైన లాయర్ కోర్టుకు చెప్పిన వివరాల్లో, ఒకే అంశంపై 35 ఖీ×=లు నమోదు చేయడం అన్యాయమని



పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. కానీ, ప్రభుత్వం తరపున వెలువడిన వాదనలో, వేర్వేరు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఈ ఖీ×=లు అందుకున్నట్టు కోర్టుకు తెలియజేశారు. దీంతో కోర్టు ఆ అంశాన్ని పరిశీలిస్తోంది.. ఈ కేసులపై తదుపరి విచారణను ఏపీ హైకోర్టు మార్చి 2వ తేదీకి వాయిదా వేసింది.



# ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- ఆలేరు, యాదగిరిగుట్ట ఎన్నికల ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్
- పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై సమీక్ష



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన ఎన్నికల ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారన్న వివరాలను కలెక్టర్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అలాగే వార్డు వారీగా బ్యాలెట్ పేపర్లు సక్రమంగా అందజేశారా? అనే అంశంపై సమీక్షించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం సాయంత్రం నాటికి పూర్తవుతుందని అధికారులు తెలిపారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ హాల్‌కు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు: 11న సెలవు

- శతశాతం పోలింగ్ లక్ష్యం.. కలెక్టర్ హనుమంతరావు వెల్లడి



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** మున్సిపాలిటీ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ సాధించడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆ రోజు స్థానిక సెలవుగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీల్లో పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సాధారణ సెలవు వర్తిస్తుందని కలెక్టర్ వెల్లడించారు. అలాగే ఎన్నికల ప్రాంతాల్లోని షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల భవనాలకు ఈ నెల 10వ తేదీ (మంగళవారం) పోలింగ్‌కు ముందు రోజు, 11వ తేదీ (బుధవారం) పోలింగ్ రోజు, 13వ తేదీ (శుక్రవారం) ఓట్ల లెక్కింపు రోజుల్లో సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికల్లో ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ విలువైన ఓటు హక్కును వినియోగించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## కోనపురి లక్ష్మమ్మకు ఘన నివాళులు

**వలిగొండ, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు నేత, బీఆర్ఎస్ పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొనపురి సాంబశివుడు, కొనపురి రాములు మాతృమూర్తి కొనపురి లక్ష్మమ్మ ఆదివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె పార్థివదేహానికి పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. అంతిమయాత్ర పూర్తయ్యే వరకు వేముల పుష్ప, సుక్క రామనర్సయ్య ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి ఆమెకు చివరి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో క్రాంతి దళ్ అధ్యక్షుడు పృధ్వి, మొగుళ్ళ శ్రీనివాస్, సంగిశెట్టి క్రిస్టఫర్, పడమటి దామోదర్ రెడ్డి, తుమ్మల వెంకటరెడ్డి, కొమురెల్లి సంజీవరెడ్డి, అయోధ్య, కోనపురి కవిత, స్వర్ణలత, నారి మల్లేష్, నారీ నరసింహ పాల్గొన్నారు.



# చౌటుప్పల్‌కు మహర్దశ కలిగిస్తా.. కాంగ్రెస్‌ను గెలిపించండి!

- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- త్వరలోనే పట్టణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- మాట తప్పను.. మడమ తిప్పను
- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం
- మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రానున్న మూడేళ్లలో పట్టణ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చుతానని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయార్థం నిర్వహించిన భారీ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చౌటుప్పల్ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే తన విజయమని పేర్కొంటూ, పట్టణానికి త్వరలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల రానున్నదని శుభవార్త వినిపించారు. ఇచ్చిన మాట తప్పను.. మడమ తిప్పను అంటూ చౌటుప్పల్ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం శుభపరిణామమని పేర్కొన్న ఆయన, మిగిలిన 19 వార్డుల్లోనూ 'చేయి' గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ నెల 11న జరగనున్న చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో చౌటుప్పల్ అభివృద్ధి శూన్యంగా మారిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చైర్మన్ అభ్యర్థిని ప్రకటించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నల్గొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తిరుపతి రవీందర్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బొబ్బిళ్ల మురళి, బొంగు జంగయ్య గౌడ్, వార్డుల వారీగా పోటీలో ఉన్న కౌన్సిలర్ అభ్యర్థులు: 1వ వార్డు కొసనం రాకేష్‌రెడ్డి, 2వ వార్డు సుర్వి మంజుల, 3వ వార్డు పల్లె లావణ్య, 4వ వార్డు ఇప్ప వెంకటేష్, 5వ వార్డు కొండూరు ధర్మేందర్ గౌడ్, 6వ వార్డు రావుల వసంత, 7వ వార్డు కాసర్ల మంజుల, 8వ వార్డు బద్రి గాలయ్య, 9వ వార్డు మోగుదాల పావని, 10వ వార్డు దేప రమ్య, 11వ వార్డు గోశిక వినయ్‌కుమార్, 12వ వార్డు పాక చిరంజీవి, 13వ వార్డు బత్తుల వాణి, 14వ వార్డు ఉడుగు జ్యోతి, 15వ వార్డు అంతటి విజయలక్ష్మీ, 16వ వార్డు సంధ్యా వెన్‌రెడ్డి, 17వ వార్డు చింతల ఉమామహేశ్వరి (ఏకగ్రీవం), 18వ వార్డు గూగులోతు అరుణ, 19వ వార్డు పిల్లలమర్రి మధుసూదన్, 20వ వార్డు హన్ను మహమ్మద్ . ఈ రోడ్‌షోలో మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ దేవాలయ కమిటీ పేరుతో తప్పుడు ప్రచారం

- నూతన కమిటీ ఏర్పాటుపై ప్రస్తుత పాలక మండలి ఖండన
- సరళ మైసమ్మ ఆలయ నూతన కమిటీ ప్రచారం అవాస్తవం
- అక్రమంగా కమిటీని ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు
- ఆలయ పవిత్రతను కాపాడటమే మా లక్ష్యం
- స్పష్టం చేసిన ప్రస్తుత పాలక మండలి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** రాచకొండ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ శ్రీ సరళ మైసమ్మ అమ్మవారి దేవాలయానికి సంబంధించి నూతన కమిటీ ఏర్పాటు అయినట్లు ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రస్తుత దేవాలయ అభివృద్ధి కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం దేవాలయ అభివృద్ధి కమిటీ (సొసైటీ నెం. 383/2012) సభ్యులు అధికారిక ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. ఈ నెల 9వ తేదీన కొన్ని పత్రికలలో అమ్మవారి దేవాలయానికి కొత్త కమిటీ ఏర్పాటైనట్లు ప్రచురితమైన వార్తల్లో ఎలాంటి నిజం లేదని కమిటీ స్పష్టం చేసింది. ప్రస్తుత పాలక మండలి సమ్మతి లేకుండా, చట్టబద్ధమైన అనుమతులు లేదా అధికారిక ఆమోదం లేకుండా ఎవరైనా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంటే అది పూర్తిగా అనధికారికమని వారు పేర్కొన్నారు. అక్రమంగా ఏర్పడిన కమిటీ పేరుతో ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించినా, నిధులు సేకరించినా అవి చట్టవిరుద్ధమని కమిటీ హెచ్చరించింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను భక్తులు నమ్మవద్దని మోసపోవద్దని విజ్ఞప్తి చేసింది. దేవాలయ పరిపాలన వ్యవహారాలు ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయని, ఆలయ పవిత్రతను కాపాడటం తమ ప్రధాన లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భక్తుల ప్రయోజనాలను కాపాడేందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వరకాంతం మహిపాల్ రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఫౌండర్ చైర్మన్ అర్థ వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కొలను మాధవరెడ్డి, ముత్యాల నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ అంజిరెడ్డి, కోశాధికారి కొలను నరేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి రాసాల శ్రీకాంత్ యాదవ్, సామ సుదర్శన్ రెడ్డి, ముత్యాల సుదర్శన్ రెడ్డి, ఫక్కీరు శ్రీకాంత్ రెడ్డి, బొడ్డు గాలయ్య (ఆగయ్య) తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో ముగిసిన ప్రచార పర్వం

**కౌన్సిలర్ బరిలో 58 మంది అభ్యర్థులు**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార హోరు నేటితో ముగిసింది. సోమవారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచార గడువు ముగిసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 20 వార్డులకు గాను ఇప్పటికే ఒక వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 19 వార్డులకు గాను మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచి ఓటర్ల మద్దతు కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ప్రచార గడువు ముగియడంతో అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు చేపట్టిన ర్యాలీలు, సభలు, ఇంటింటి ప్రచారాలకు తెరపడింది. ప్రస్తుతం 58 మంది అభ్యర్థులు వార్డు కౌన్సిలర్ పదవుల కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బుధవారం జరగనున్న పోలింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుండగా, చౌటుప్పల్ మున్సిపాలిటీలో రాజకీయ ఉత్కంఠ నెలకొంది.





## అంకిరెడ్డిగూడెంలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ ఆడిట్ నిర్వహణ






**చౌటుప్పల్, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై ఆడిట్‌లో భాగంగా గ్రామసభను గ్రామ రచ్చబండ వద్ద (సమావేశపు వేదిక) నిర్వహించారు. ఈ గ్రామసభకు సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనుల వివరాలను ప్రజలకు వివరించి, పారదర్శకతపై చర్చించారు. అనంతరం గ్రామ పరిధిలోని ఇందిరమ్మ కుంట నీటి సంపు వద్ద ఉన్న కుంటను సదును చేయుటకు (చెట్ల తొలగింపు) ఆధునిక యంత్రం (హిటాచి లాంగ్ బూమ్) ద్వారా పనులను ప్రారంభించారు. ఈ పనులు దివిస్ పరిశ్రమ వారి సహకారంతో సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యక్రమాధికారి ఈశ్వరయ్య, జిల్లా వనరుల అధికారి డేవిడ్, సాంకేతిక సహాయకుడు తాటిపాముల శ్రీశైలం పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, దివిస్ పరిశ్రమ ఉద్యోగులు వెంకటేశ్వర్లు, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండు గౌడ్ హాజరయ్యారు. గ్రామ వార్డు సభ్యులు శ్రీమతి బత్తుల అనూష మహేష్ గౌడ్, పాలెం వెంకటేష్ గౌడ్, ముద్దం లింగస్వామి గౌడ్, శ్రీమతి దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, శ్రీమతి బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, శ్రీమతి రాపోలు రేణుక మల్లేశం పాల్గొన్నారు. అలాగే గంగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గంగిరెడ్డి రమణా రెడ్డి, గంగిరెడ్డి అంజిరెడ్డి, మోడెపు నరసింహ గౌడ్, మోడెపు పెంటయ్య గౌడ్ తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అర్ధరాత్రి అగ్నిప్రమాదం: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**సంస్థాన్ నారాయణపురం, (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బద్దుల పెద్ద పెంటయ్య ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పెంటయ్య కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా అర్ధరాత్రి ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వేగంగా వ్యాపించడంతో గమనించిన బాధితులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. స్థానిక కాలనీ యువకులు వెంటనే స్పందించి, ప్రాణాలకు తెగించి సాహసోపేతంగా మంటలను ఆర్పివేశారు. వారి సమయస్ఫూర్తి వల్ల పక్కనే ఉన్న ఇతర ఇళ్లకు మంటలు వ్యాపించకుండా నివారించగలిగారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని బీరువాలో భద్రపరుచుకున్న రూ. 60 వేల నగదు, రెండు తులాల బంగారంతో పాటు, భూమి పట్టా కాగితాలు, బట్టలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి ఆసరాగా నిలవాలని బాధితుడు పెంటయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.



# వినయ్ కి ఓటు.. చౌటుప్పల్ ప్రగతికి బాట!

- డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత,
- 11వ వార్డులో ఇంటింటి ప్రచారం
- 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గోశిక వినయ్ నేత





**చౌటుప్పల్, ఫిబ్రవరి 9 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 11వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గోశిక వినయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'చేయి' గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోశిక వినయ్ నేత ను భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా రోజుకు 18 గంటలు శ్రమిస్తూ తెలంగాణ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. అప్పులపాలైన తెలంగాణ రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 70 శాతం పైగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. నల్గొండ జిల్లాలో నల్గొండ కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని హెచ్చరించారు. గత రెండేళ్లలో పట్టణాభివృద్ధికి రూ.19 వేల కోట్ల నిధులు ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు వంటి పథకాలు ప్రజాపాలనలో అమలై దేశానికి ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీలు అక్రమ సంపాదనతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలో ఆ పార్టీలకు సరైన అభ్యర్థులే లేని పరిస్థితి ఉందన్నారు. 2029లో తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సామల భాస్కర్, పబ్బు రాజు గౌడ్, బడుగు లక్ష్మయ్య, చింతల వెంకటరెడ్డి, రాజేందర్ రెడ్డి, పాలకూర్ల స్వామి, గుర్రం పాండురంగ, గోశిక ప్రభాకర్, గోశిక రవి, రాపోలు రాజశేఖర్, నోముల మాధవరెడ్డి, గుజ్జరి శ్రవణ్ కుమార్, గంజి దేవదాస్, కర్నాటి శ్రీశైలం, వార్డు కాంగ్రెస్ పార్టీ నేతలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 సమ్మెకు దూరంగా ఉండాలి

- విధులకు హాజరై లక్ష్య సాధనకు సహకరించండి
- మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ



**మందమర్రి, ఫిబ్రవరి 9: (తొలివెలుగు):** ఫిబ్రవరి 12వ తేదీన కొన్ని కార్మిక సంఘాలు తలపెట్టిన ఒకరోజు సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సమ్మెలో పేర్కొన్న డిమాండ్లలో చాలా వరకు సింగరేణి కార్మికులకు నేరుగా సంబంధించినవి కావని, అలాగే సింగరేణి యాజమాన్యం పరిష్కరించగలిగినవి కూడా కావని తెలిపారు. సింగరేణి పరిధిలోని సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అటువంటి పరిస్థితుల్లో సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం లేదని అన్నారు. వివిధ కారణాల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపులో కొంత వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిరోజూ సాధించే ఉత్పత్తి ఎంతో కీలకమని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగాలంటే బొగ్గు ఉత్పత్తి, రవాణాలో కార్మికుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఒకరోజు సమ్మె జరిగితే సుమారు రూ.77 కోట్ల విలువైన ఉత్పత్తి నష్టం, సుమారు రూ.12 కోట్ల మేర కార్మికుల వేతన నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అలాగే సుమారు 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టం జరుగుతుందని వివరించారు. గత ఆర్థిక సంవత్సరం 202425లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించడంతో పాటు ఉద్యోగులకు లాభాల బోనస్, పిఎల్ఆర్ బోనస్లు చెల్లించామని, వివిధ సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 49 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, మిగిలిన 23 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన రెండు నెలలు ప్రతిరోజూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకే ఫిబ్రవరి 12న తలపెట్టిన సమ్మెకు దూరంగా ఉండి విధులు నిర్వహించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్.ఓ. టు జీఎం జి.ఎల్. ప్రసాద్, కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్‌తో పాటు మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మధిర గడ్డపై ప్రచారం చివరి రోజు గులాబీ శ్రేణుల జోరు



**ఖమ్మం (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజున మధిర పట్టణంలోని 4, 11, 12, 13, 14, 17, 18, 20, 21, 22 వార్డుల్లో బీఆర్ఎస్ తరఫున, అలాగే బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల కోసం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్, మధిర అసెంబ్లీ ఇంచార్జి లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో, గులాబీ శ్రేణులు కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మధిర నియోజకవర్గానికి చెందిన పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, మధిర మున్సిపాలిటీలో ప్రజలను ఓట్లు అడగడానికి ముందు భట్టి విక్రమార్క శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డులు ఇచ్చి, మూడు నెలల్లో అధికారంలోకి రాగానే అందులో ఉన్న హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పిన భట్టి విక్రమార్క, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మధిర పట్టణంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనీ కేసీఆర్ పాలనలోనే జరిగిందని నామ తెలిపారు. 100 పడకల ఆసుపత్రి, ట్యాంక్‌బండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డివైడర్, పార్కులు సహా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. మధిర పట్టణంలో తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా, కరెంటు కష్టాలు తొలగించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల వేళ శంకుస్థాపనలు, నిధుల మంజూరు పేరుతో హడావుడి చేస్తున్న భట్టి విక్రమార్కకు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచిన తరువాతే మధిర అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. ఆటో కార్మికుల జీవన భద్రత, సంక్షేమంపై కాంగ్రెస్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా ఇల్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున, అలాగే బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పాలనకు మద్దతుగా నిలవాలన్నారు. మధిర ప్రజలు కేసీఆర్ పాలన కాంగ్రెస్ పాలన మధ్య తేడాను గమనించి, కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని, కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం దిశగా నడిపించాలని నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.




# మళ్లీ వెండి వేడి


న్యూఢిల్లీ: విలువైన లోహాల ధరలు మళ్లీ జోరందుకున్నాయి. తాజాగా వెండి కిలో ధర దాదాపు 7 శాతం(రూ. 17,000) జంప్‌చేసింది. అన్ని పన్నులు కలుపుకుని రూ. 2,72,000కు చేరింది. ఇదే బాటలో బంగారం ధరలు సైతం మెరిశాయి. స్థానిక బులియన్ మార్కెట్లో 99.9 స్వచ్ఛతగల 10 గ్రాములు రూ. 1,300 బలపడింది. రూ. 1,58,500ను తాకింది. వారాంతాన వెండి కేజీ రూ. 2,55,000 వద్ద, పసిడి 10 గ్రాములు రూ. 1,57,200 వద్ద నిలిచిన విషయం విదితమే. ధరల తాజా పెరుగుదలకు యూఎస్ డాలరు బలహీనపడటం, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పుంజుకోవడం కారణమైనట్లు బులియన్ వర్గాలు తెలియజేశాయి. అంతేకా కుండా ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో కొనసాగుతున్న అనిశ్చితికితోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ తీసుకుంటున్న అనూహ్య రాజకీయ, భౌగోళిక చర్యలు వెండి, పసిడి తదితర విలువైన లోహాలకు డిమాండును పెంచుతున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో సిల్వర్ స్పాట్ ధర ఔన్స్ 2.8 శాతం(2.2 డాలర్లు) ఎగసింది. 80.21 డాలర్లను తాకింది. మరోపక్క పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 1 శాతం పుంజుకుని 5,013 డాలర్లకు చేరింది.

# రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌ను మించి ఫ్రాడ్.. డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..

దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై జరిగిన విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజల డబ్బు రక్షణలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేసింది. అనుమానాస్పద లావాదేవీలు జరిగితే ఖాతాదారులకు తక్షణమే అలర్ట్ ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. అకస్మాత్తుగా భారీ మొత్తాల లావాదేవీలు జరిగితే బ్యాంకులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. అవసరమైతే ఆ లావాదేవీలపై తాత్కాలికంగా హోల్డ్ పెట్టే అధికారం బ్యాంకులకు ఉండాలని స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో ప్రధానంగా వృద్ధులు, సాధారణ ఖాతాదారులే బాధితులవుతున్నారని పేర్కొంది సుప్రీంకోర్టుడ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా భయపెట్టి డబ్బులు దోచుకుంటున్న ఘటనలు అత్యంత తీవ్రమైనవిగా అభివర్ణించింది. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ాా×, ఆధునిక టెక్నాలజీని బ్యాంకులు వినియోగించాలి అని ధర్మాసనం సూచించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ాూాం) ను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. సైబర్ మోసాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం, =దీ×, బ్యాంకులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాకుండా, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. ఇక, హోం మంత్రిత్వ శాఖ (వీనూ) గణాంకాల ప్రకారం, ఏప్రిల్ 2021 నుంచి నవంబర్ 2025 వరకు దాదాపు రూ.52,000 కోట్లకు పైగా సైబర్ ఫ్రాడ్ జరిగింది. ఈ మొత్తం అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌ను మించిపోవడం గమనార్హం. ఈ స్థాయిలో మోసాలు జరగడం దేశ ఆర్థిక భద్రతకు పెద్ద ముప్పుగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల సొమ్ము రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# పార్లమెంట్‌లో కొనసాగుతున్న నిరసనలు, ఆందోళనలు

**స్పీకర్ ఓం బిర్లా తీరుపై విపక్షాల ఆగ్రహం**




రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడలేకపోయారు. మాజీ ఆర్మీ చీఫ్ రాసిన పుస్తకాన్ని ప్రస్తావించినందుకు స్పీకర్, కేంద్రమంత్రులు అడ్డుకున్నారు. అనంతరం ప్రధాని మోడీ కూడా మాట్లాడాల్సి ఉంది. కానీ మోడీ మాట్లాడకుండానే రాష్ట్రపతి ధన్యవాద తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. లోక్‌సభలో ప్రధాని మోడీపై ప్రతిపక్ష సభ్యులు దాడి చేసే అవకాశం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మోడీ మాట్లాడకుండానే ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు మండిపతున్నాయి. ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధపడుతున్నారు. సోమవారం ఉదయం మల్లిఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఇండియా కూటమి సభ్యులంతా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్ష సభ్యులంతా అంగీకారం తెలిపారు. దీంతో 100 మంది ఎంపీల సంతకాలతో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు.

# నరవణే పుస్తకం రాహుల్‌గాంధీ చేతికి ఎలా వచ్చింది?

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మాజీ ఆర్మీ చీఫ్ నరవణే రాసిన పుస్తకం తీవ్ర దుమారం రేపుతోంది. గత వారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మాపంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూడ మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే రాసిన "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ"లోని ఆత్మకథకు సంబంధించిన అంశాలను లేవనెత్తారు. అంతే వెంటనే కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ మైక్ కట్ చేశారు. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. అధికార-ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. మనోజ్ నరవణే మాజీ ఆర్మీ చీఫ్. భారత సైన్యంలో నాలుగు దశాబ్దాలు పాటు సేవలందించారు. 1962 తర్వాత జరిగిన అతిపెద్ద భారత్-చైనా ఘర్షణలను పర్యవేక్షించిన అధికారి. రిటైర్డ్ అయిన తర్వాత నరవణే ఆత్మకథ రాశారు. ఇందులో దేశానికి సంబంధించిన అంతర్గత విషయాలు పొందిపరిచారు. దీంతో ఈ పుస్తకం ప్రచురణకు కేంద్రం అనుమతించలేదు. అయినా కూడా ప్రచురించని పుస్తకం కాపీ రాహుల్ గాంధీకి చేతికి ఎలా వచ్చింది? అని కేంద్రం తర్జనభర్జన పడుతోంది. ప్రస్తుతం ఈ విషయంపై కేంద్రం ఆరా తీస్తోంది.

**పుస్తకంలో అసలేముంది?**

మనోజ్ నరవణే.. మాజీ ఆర్మీ చీఫ్. తన జీవితంలో జరిగిన అంశాలను ఆత్మకథగా రాసుకున్నారు. ఇందులో అనేక అంశాలను ప్రస్తావించారు. 2020లో భారత్-చైనా సరిహద్దు ఉద్రిక్తతలు, తూర్పు లడఖ్‌లో సైనిక చర్యలు, ప్రభుత్వ-సైన్యం మధ్య నిర్ణయం తీసుకునే ప్రక్రియ, వ్యూహాత్మక ఆలోచనలతో సహా అతని సైనిక అనుభవాలను వివరించారు. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలు డిసెంబర్ 2023లో మీడియాలో ప్రచురించబడ్డాయి. చైనాతో ఘర్షణ సమయంలో తలెత్తిన అంశాలను ప్రస్తావించారు. ఆ సమయంలో 'నియంత్రణ'లో లేదని పేర్కొన్నారు. పుస్తకంలోని కొన్ని అంశాలు సున్నితంగా ఉన్నాయి. ఎందుకంటే.. జాతీయ భద్రత, వ్యూహాత్మక నిర్ణయాలు నేరుగా ప్రస్తావించబడ్డాయి. దీంతో అధికారికంగా ప్రచురణకు నోచుకోలేదు. (ఎ) 1954 ఆర్మీ రూల్స్‌లోని సెక్షన్ 21 ప్రకారం..సర్వీస్ సబ్జెక్టులు, భద్రతా విషయాలపై ఎటువంటి విషయాలను ప్రచురించకూడదు. ఇక సైనిక సంబంధిత సమాచారాన్ని ప్రత్యక్షంగానీ.. పరోక్షంగానీ పత్రికలకు గానీ.. ఇతర ఏ రూపంలోనూ ప్రచురణ చేయకూడదు. ఇక కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా పుస్తకం లేదా కథనాన్ని ప్రచురించకూడదు. ఇక సర్వీస్ సమాచారాన్ని కూడా ఎవరితో పంచుకోవడానికి వీలుండదు. ఇవన్నీ ఆర్మీ నిబంధనలోకి వస్తాయి. ఈ నేపథ్యంలోనే మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే రాసిన ఆత్మకథ అధికారికంగా ప్రచురణ జరగలేదు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం సమీక్షలో ఉండడంతో ప్రచురణ జరగలేదు. అయితే గత వారం రాహుల్‌గాంధీ జాతీయవాదం అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడుతూ.




నరవణేకు సంబంధించిన అంశాలు ఒక మ్యాగజైన్‌లో ప్రచురితమైన అంశాలను లేవనెత్తారు. వెంటనే కేంద్రమంత్రులు అడ్డుతగిలారు. అంతేకాకుండా స్పీకర్ మైక్ కూడా కట్ చేశారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు ఆందోళన దిగారు. మరుసటి రోజే రాహుల్ గాంధీ నరవణే రాసిన పుస్తకాన్ని పార్లమెంట్ ఆవరణలో మీడియాకు చూపించారు. అవసరమైతే ప్రధాని మోడీకి అందిస్తానని చెప్పారు. అంటే ఈ పుస్తకం ఏప్రిల్, 2025కు ముందే ప్రచురణ జరిగినట్లుగా వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ పుస్తకం ముద్రణపై కేంద్రం సీరియస్‌గా ఆరా తీస్తోంది.

# 114 రాఫెల్ జెట్‌ల కోసం భారత్-ఫ్రాన్స్ మధ్య ఒప్పందం.!



# పాక్‌లో తక్షశిలకు ఎందుకెళ్లారు?

గువాహటి: అస్సాం బీజేపీ అగ్రనేత, రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మధ్య పరస్పర ఆరోపణల అగ్ని మరింత రాజుకుంది. "భార్య ఉద్యోగ పనుల నిమిత్తం 2013 డిసెంబర్‌లో పాకిస్తాన్‌కు వెళ్లానని గోగోయ్ చెప్తున్నారు. అయితే వీసా అనుమతుల ప్రకారం లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్‌లకు మాత్రమే పర్యటించే వీలుంది. కానీ రావల్పిండి జిల్లాలోని తక్షశిలకు గోగోయ్ దంపతులు ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?. వీసా పరిధిలోని నగరాలకు వెళ్లేందుకు పాకిస్తాన్‌లో స్థానికంగా గొగోయ్‌కు ఎవరు అనుమతి ఇచ్చారు?. రావల్పిండి జిల్లాల పర్యటన ఏర్పాట్లు స్థానికంగా చేసిందెవరు?. పాకిస్తాన్ ఆర్మీ జనరల్ ప్రధాన కార్యాలయం సైతం రావల్పిండిలోనే ఉంది. పాక్ నిఘా వర్గాలతో గొగోయ్‌కు సంబంధం ఉందనడానికి ఇంతకంటే రుజువులు కావాలా?. గొగోయ్ తన పాక్ అనధికర, దేశవ్యతిరేక పర్యటనపై వివరణ ఇవ్వాల్సిందే"అని సీఎం హిమంత డిమాండ్‌చేశారు. హిమంత ఆరోపణలపై గొగోయ్ సోమవారం దీటుగా ప్రతిదాడిచేశారు. "నా కుటుంబానికి పాకిస్తాన్‌తో ఎలాంటి సంబంధం లేదు. భార్య పనినిమిత్తం పది రోజులు మాత్రమే పాక్‌కు వెళ్లివచ్చాం. అక్కడ ఎవరినీ కలవలేదు. ఈ విషయం అస్సాం పోలీస్ రిపోర్ట్‌లోనూ స్పష్టంగా ఉంది. నివేదిక వచ్చి ఆరు నెలలవుతుంటే ఇన్నాళ్లూ హిమంత ఏం చేస్తున్నట్లు?. హిమంత తన కుటుంబం ఆక్రమించిన వేల ఎకరాల భూముల అంశం నుంచి అస్సామీల దృష్టి మరల్చేందుకే నాపై అభాండాలు వేస్తున్నారు. రాష్ట్రంలో ఆరు కులాలకు ఎస్టీ హోదా, మాదకద్రవ్యాలు హోరెత్తడం వంటి సమస్యలపై దృష్టిపెడితే బాగుంటుంది. అవి వదిలేసి బంగ్లాదేశీ ముస్లిం వలసదారు(మియా)లను లక్ష్యంగా చేసుకుంటూ వాళ్లను రైఫిల్‌తో గురిపెట్టి కాల్చుతున్నట్లు ఉన్న వీడియోను ఆన్‌లైన్‌లో విస్తృత ప్రచారంచేశారు. ఇలాంటి మతవిద్వేష వీడియోలను బీజేపీ అస్సాం విభాగం సోమవారం 'ఎక్స్'లో పోస్ట్‌చేసి తీవ్ర విమర్శలు రాగానే తొలగించారు. ఈ వివాదంలో పోలీసులు సూమోటోగా కేసు నమోదుచేసి సీఎంపై నేరం మోపాలి"అని గొగోయ్ డిమాండ్‌చేశారు.

# కెనడాలో కర్నాటక వాసి కాల్చివేత

ఒట్టావా/బెంగళూరు: కెనడాలోని టొరంటో నగరంలో ఉన్న షాపింగ్ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో కర్నాటక వాసి (37) ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని బ్రాంప్టన్‌లో ఉండే చందన్ కుమార్ రాజా నందకుమార్‌గా కెనడా పోలీసులు గుర్తించారు. వుడ్‌బైన్ షాపింగ్ సెంటర్ వాహన పార్కింగ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం 3.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కాల్పుల గురించి సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నామని పోలీసులు తెలిపారు. బుల్లెట్ గాయాలతో పడి ఉన్న వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తరలించామని, చికిత్స పొందుతూ అతడు చనిపోయాడన్నారు. చందన్‌కుమార్ వాహనం కిటికీల అద్దాలకు బుల్లెట్ రంధ్రాలు పడగా, డ్రైవర్ వైపు ఉన్న కిటికీ అద్దం పూర్తిగా ధ్వంసమైంది. కాగా, కాల్పులకు పాల్పడిన వ్యక్తుల వివరాలు తెలియనప్పటికీ, దీనిని లక్షిత ఘటనగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

**ఇంటికి రావాలని చెబుతున్నా...వినలేదు:తల్లిదండ్రులు**

చందన్ మరణవార్త విని కర్నాటక రాజధాని బెంగళూరులో శివారు నెలమంగళలో ఉంటున్న అతడి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. ఇలాంటిది జరుగుతుందని తాము కలలో సైతం ఊహించలేదన్నారు. దాదాపు ఏడేళ్ల నుంచి కెనడాలో ఉంటున్న చందన్‌ను ఇంటికి రావాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని, కానీ వినిపించుకోలేదని తండ్రి నందన్ కుమార్ వాపోయారు. అంతిమ సంస్కారం జరిపేందుకు మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు సాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని ఆయన కోరారు. చందన్ టొరంటోలో ఇటీవలే కన్నడ అసోసియేషన్‌ను స్థాపించారని, బహుశా ఇదే కక్షతో అతడిని బలి తీసుకుని ఉంటారని తల్లి అనుమానం వ్యక్తం చేశారు.



# చిప్ రంగంలో స్వయం సమృద్ధి!

న్యూఢిల్లీ: డిజిటల్ ప్రపంచంలో 'ఆత్మనిర్భర్ భారత్'నినాదానికి బలం చేకూరుస్తూ కేంద్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రానిక్స్ రంగానికి వెన్నెముక లాంటి సెమీకండక్టర్ల (చిప్స్) తయారీలో దేశాన్ని అగ్ర స్థానానికి చేర్చేందుకు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0'(ఐఎస్ఎం 2.0)కు శ్రీకారం చుట్టింది. 202627 బడ్జెట్‌లో ఈ మిషన్ కోసం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించింది. పరిశోధన, శిక్షణ, పరికరాల తయారీపై దృష్టి సారిస్తూ, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా దేశీయ టెక్నాలజీని అభివద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల తయారీలో తైవాన్, చైనా, కొరియా దేశాల ఆధిపత్యం నడుస్తోంది. కోవిడ్ సమయంలో చిప్స్ సరఫరా చైన్ దెబ్బతినడంతో మొబైల్స్ నుంచి కార్ల తయారీ వరకు అన్నీ స్తంభించిపోయాయి. ఈ చేదు అనుభవాల దష్ట్యా, సరఫరా గొలుసులో చైనాపై ఆధారపడకూడదని భారత్ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే 'మేక్ ఇన్ ఇండియా మేక్ ఫర్ ది వరల్డ్'లక్ష్యంతో అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రారంభించిన తొలి దశ (ఐఎస్ఎం 1.0) విజయవంతమైంది. రూ.76 వేల కోట్ల ప్రోత్సాహకాలతో మొదలైన ఈ ప్రయాణంలో డిసెంబర్ 2025 నాటికి ఏకంగా రూ.1.60 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 భారీ ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. ఇప్పుడు ఐఎస్ఎం 2.0 ద్వారా కేవలం చిప్స్ అసెంబ్లింగ్ మాత్రమే కాకుండా ముడి సరుకులు, పరికరాలు, డిజైనింగ్ కూడా భారత్‌లోనే జరిగేలా ప్రణాళిక రచించారు. సెమీకండక్టర్, డిస్‌ప్లే తయారీ ఎకోసిస్టమ్ కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 8,000 కోట్ల భారీ ప్రణాళిక రూపొందించారు. రూ. 4,000 కోట్ల పెట్టుబడితో మరో కొత్త చిప్ తయారీ యూనిట్ ద్వారా 1,500 మందికి ఉపాధి కల్పించానున్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..






## పట్టాలకెక్కనున్న జై హనుమాన్

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది.అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, ÷-రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.





## మహారాణి నయన అడుగు పెట్టింది

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.

## జక్కన్న వ్యాఖ్యలపై వానరసేన మండిపాటు

ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన 'వారణాసి' సినిమా టైటిల్స్ గ్లింప్స్ వేడుకలో జక్కన్న చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని రాష్ట్రీయ వానరసేన ఎస్ఎస్ రాజమౌళిపై సరూర్ నగర్ పోలీసుకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రాజమౌళి పై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఎవరూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంఘం సభ్యులు పోలీసులను కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రాజమౌళి బాధతో పాటు అసహనానికి గురయ్యారు. స్టేజి మీద ఆయన మాట్లాడుతూ.. 'నాకు దేవుడి మీద నమ్మకం లేదు.



## త్వరలోనే ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన

గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడించారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన '12ఎ రైల్వే కాలనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... 'చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.



## రాజశేఖర్ సరసన మరోమారు రమ్యకృష్ణ

యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు.తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు.ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి మూడ్ను గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్- రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు.